క్లుప్తంగా

లారీ బోల్తా

డ్రైవర్ సురక్షితం



కొందుర్గు వద్ద బోల్తాపడిన లారీ

కొందుర్గు: కల్వర్టు ఢీ కొని లారీ బోల్తాపడిన సంఘటన మంగళవారం కొందుర్గులో చోటు చేసుకుంది. హైద్రాబాద్ చర్లపల్లి నుంచి పరిగి వైపు వెళ్తున్న టీఎస్ 08యూబీ 0193 నంబర్ గల లారీ కొందుర్గు వద్ద అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న కల్వర్ట్ ఢీకొని బోల్తాపడింది. డ్రైవర్ అజయ్ సురక్షితంగా బయటపడ్డారు. ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

నెహ్రూ సేవలు చిరస్మరణీయం



విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

షాద్‌నగర్: భారత మొదటి ప్రధాని స్వర్గీయ జవహర్‌లాల్ నెహ్రూ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని పలువురు నాయకులు పేర్కొన్నారు. మంగళవారం నెహ్రూ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని ఎల్ఎన్ కాలనీలో ఉన్న ఆయన విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు అగ్గనూరు విశ్వం, గోపాల్, రాజు, ఉస్మాన్, శ్రీనివాస్, నీరటి వాసు, మున్నాగౌడ్, యాదయ్య, వెంకటయ్య, జీవన్, హరీశ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు విరాళం



నగదు అందజేస్తున్న మాజీ సర్పంచ్ గోపాల్‌రెడ్డి

చేవెళ్ల: గ్రామాలు, పట్టణాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలను నియంత్రచవచ్చని సీఐ భూపాల్‌శ్రీధర్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని పామెనలో సీసీ కెమెరాల ఏర్పాటుకు మంగళవారం మాజీ సర్పంచ్ దావల్గారి గోపాల్‌రెడ్డి 1 లక్ష 50 వేల రూపాయల విరాళం సీఐ సమక్షంలో నిర్వహణ ప్రతినిధికి అందజేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని, నేరాల ఛేదనలో అవి ముఖ్య పాత్ర పోషిస్తాయన్నారు. గ్రామాల్లో దాతలు ముందుకు వచ్చి కెమెరాల ఏర్పాటుకు సహకరించాలని కోరారు. దాత గోపాల్‌రెడ్డిని ఆయన అభినందించారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు, ప్రజలు ఉన్నారు.

శనైశ్వరాలయానికి వెండి పాత్ర బహూకరణ



వెండి పాత్రను అర్చకుడికి అందజేస్తున్న దాత విఘ్నేశ్‌గౌడ్ దంపతులు

చేవెళ్ల: ప్రసిద్ధిగాంచిన వికారాబాద్ జిల్లా ఎన్కేతలలోని శనైశ్వరాలయానికి మంగళవారం పట్టణానికి చెందిన దాత విఘ్నేశ్‌గౌడ్ దంపతులు కిలో వెండితో చేసిన అభిషేకం చేసే పాత్రను బహూకరించారు. ఈ మేరకు 1 లక్ష 20 వేల రూపాయల విలువచేసే వెండి అభిషేకం పాత్రను దాత ఆలయంలో అర్చకుడికి అందజేశారు. అనంతరం దాతను ఆలయ నిర్వాహకులు అభినందించారు.

సన్మానం



కాటం భాగ్యలక్ష్మిని సన్మానిస్తున్న జాతీయ బీసీసేన నాయకులు

షాద్‌నగర్‌రూరల్: మానవ హక్కుల పరిరక్షణకు కృషిచేస్తూ రితిక ఫౌండేషన్ ఆధ్వర్యంలో నంది అవార్డు అందుకున్న కాటం భాగ్యలక్ష్మిగౌడ్‌ను జాతీయ బీసీ సేన నాయకులు మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శాలువా, పూలమాలలతో ఆమెను సత్కరించారు.

వంతెన పనులు వేగవంతం

- మూసీవాగుపై ముమ్మరంగా కొనసాగుతున్న బ్రిడ్జి నిర్మాణం
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు, వాహనాదారులు
- త్వరగా పూర్తిచేయాలని వినతి

మొయినాబాద్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల ప్రజలకు అనుసంధానంగా రోడ్ల అభివృద్ధితో పాటు లింక్ రోడ్లు, వాగులపై వంతెనలను నిర్మిస్తామని ఇచ్చిన హామీ ఎట్టకేలకు నెరవేరుతోంది. గత బీఆర్ఎస్ పాలనలో ఈసీ వాగుపై వంతెన నిర్మాణానికి రూ.5కోట్లు సీఆర్ఆర్ (కన్‌స్ట్రక్షన్ ఆఫ్ రూరల్ రోడ్స్) నిధులు మంజూరయ్యాయి. అప్పట్లో గత పాలకులు ఆర్భాటంగా బ్రిడ్జి నిర్మాణానికి శిలాఫలకం వేసి వదిలేశారు. 11 ఏళ్ల తర్వాత వంతెన నిర్మాణ పనులు పనులు ప్రారంభమయ్యాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రయాణ సౌకర్యం మెరుగు

మండల పరిధిలోని నక్కలపల్లి, హైతాబాద్ గ్రామాల మధ్యలో గల ఈసీ వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. దీంతో ఈ పనులు నెలరోజుల నుంచి జోరుగా సాగుతున్నాయి. ఈ బ్రిడ్జి నిర్మాణానికి అప్పటి ప్రభుత్వంలోనే నిధులు మంజూరు చేశారు. కానీ ప్రభుత్వం మారడంతో బిల్లులు రాక పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రాలేకపోయారు. గత నెల 7వ తేదీన ఈ వంతెన నిర్మాణానికి అధికారులు పనులు ప్రారంభించారు. ప్రస్తుతం పుట్టింగ్‌లు, పిల్లర్లతో పనులు సాగుతున్నాయి. వర్షాకాలం రాకముందే పిల్లర్లను నేలమట్టం చేసేందుకు కృషి చేస్తున్నారు. దీంతో చుట్టుపక్కన గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే ఇటు మొయినాబాద్ మండలం, నక్కలపల్లి, ఎత్‌మార్‌పల్లి, టోల్‌కట్ట, కేతిరెడ్డిపల్లి, చాకలిగూడ, కనకమామిడి, అప్పారెడ్డిగూడ ప్రజలతో పాటు నక్కలపల్లి నుంచి షాబాద్ మండలంతో పాటు సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ, షాద్‌నగర్, పరిగి మండలాలకు ప్రయాణ సౌకర్యం మెరుగవుతుందని వాహనాదారులు, ప్రజలు పేర్కొంటున్నారు. అధికారులు బ్రిడ్జి నిర్మాణంలో అలసత్వం వహించకుండా త్వరగా పూర్తిచేసేందుకు కృషి చేయాలని కోరుతున్నారు.



పిల్లర్ల దశలో ఈసీవాగుపై బ్రిడ్జి నిర్మాణ పనులు

త్వరగా పూర్తిచేయాలి



నక్కలపల్లి ఈసీవాగు వంతెన నిర్మాణంతో రైతులతో పాటు వాహనాదారులు, ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రజలకు ఎంతో సౌకర్యం కలుగుతుంది. ఇది గత ప్రభుత్వంలో చేయాల్సి ఉండగా అప్పట్లో పట్టించుకోలేదు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా నిర్మాణ పనులు ప్రారంభించడం సంతోషంగా ఉంది. త్వరగా పూర్తిచేస్తే రైతులకు, వాహనాదారులకు ఎంతో సౌకర్యం కల్పించినట్లు అవుతుంది.

– గౌరీ సతీష్, నక్కలపల్లి

ముమ్మరంగా సాగుతున్నాయి



నక్కలపల్లి–హైతాబాద్ మధ్యలో ఉన్న ఈసీ వాగుపై వంతెన నిర్మాణాలు చురుకుగా సాగుతున్నాయి. ఈ వంతెన నిర్మాణంలో మొత్తం తొమ్మిది పిల్లర్లు వేస్తున్నారు. పిల్లర్లు హైవే వరకు మంజూరైన ఐదు కోట్లు సరిపోతున్నాయి. మిగతా రూట్ లెవల్ వేయడానికి అదనపు నిధులు కావాలని దాదాపు 7.50 కోట్లు అవసరం ఉంటుందని నివేదికపై అధికారులకు తెలియజేశాం. బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభించి 40 రోజులు అవుతోంది. నిర్మాణ పనులకు అందరూ సహకరిస్తున్నారు.

– ఆశాజ్యోతి, పంచాయతీరాజ్ ఏఈ, మొయినాబాద్

జనుము విత్తనాల కోసం బారులు

కొందుర్గు: మండల కేంద్రంలో రైతన్నలు జనుము విత్తనాల కోసం ఉదయం 8 గంటలకే రైతువేదికకు బారులు తీరారు. కాగా మండలంలోని 20 రెవెన్యూ గ్రామాలకు సంబంధించిన రైతులకు 1000 క్వింటాళ్ల జనుములు, 200 క్వింటాళ్ల జీలుగలు అవసరం ఉంటుందని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని ఏఓ సురేష్ తెలిపారు. కాగా 220 క్వింటాళ్ల జనుములు, 60 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు మంజూరయ్యాయని పేర్కొన్నారు. ప్రస్తుతం 100 క్వింటాళ్ల జనుములు, 30 క్వింటాళ్ల జీలుగలు మాత్రమే మంగళవారం వచ్చాయన్నారు. అయితే 243 మంది రైతులకు జనుములు పంపిణీ చేశామని, జీలుగ విత్తనాలు మాత్రమే పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని స్పష్టం చేశారు. త్వరలోనే ఇంకా జనుము విత్తనాలు వస్తాయని తెలిపారు.

జిల్లేడ్ చౌదరిగూడలో..

రైతులు పచ్చిరొట్ట ఎరువు కింద సాగు చేసేందుకు రాయితీపై జనుము, జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయాధికారి రాజేందర్‌రెడ్డి తెలిపారు. ప్రస్తుతం 180 క్వింటాళ్ల జనుములు, 19.8 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని స్పష్టం చేశారు. అవసరమైన రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు తీసుకొని ఏఈఓల వద్ద పర్మిట్లు రాయించుకొని, ఆగ్రోస్ రైతు సేవా కేంద్రంలో విత్తనాలు పొందాలని సూచించారు.



కొందుర్గులో జనుము విత్తనాల కోసం పర్మిట్లు రాయించుకుంటున్న రైతులు

అందుబాటులో పచ్చిరొట్ట విత్తనాలు

మండల వ్యవసాయాధికారి శిరీష



కేశంపేట: అందుబాటులో ఉన్న విత్తనాలు

కేశంపేట: పచ్చిరొట్ట విత్తనాలు మండల కేంద్రంలోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రంలో అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయాధికారి శిరీష తెలిపారు. 50 శాతం సబ్సిడీపై రైతులకు అందిస్తామని స్పష్టం చేశారు. విత్తనాలు కావాల్సిన వారు వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించి తమ భూమి పట్టాదారు పాసుబుక్‌తో పాటు ఆధార్ కార్డును తీసుకొస్తే ఆన్‌లైన్ చేస్తామన్నారు. అనంతరం రైతులు ఆగ్రోస్ సేవా కేంద్రానికి వెళ్లి సబ్సిడీ పోగా మిగతా డబ్బులను చెల్లించి విత్తనాలను తీసుకెళ్లాలని ఆమె కోరారు. పచ్చిరొట్ట విత్తనాల సాగు ద్వారా భూసారం పెరుగుతుందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మొత్తం 266 బస్తాలు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు.

నేటి నుంచి జీలుగ విత్తనాల పంపిణీ

షాబాద్: జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయాధికారి వెంకటేశం పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని వ్యవసాయశాఖ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. 50శాతం సబ్సిడీపై షాబాద్ సహకార బ్యాంకు వద్ద జీలుగ విత్తనాలు రైతులకు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. జీలుగ 75 క్వింటాళ్లు వచ్చాయని, 30కిలోల బస్తా ధర రూ.4,275లు, 50 శాతం సబ్సిడీ పోను రూ.2,137.50లకు వస్తుందన్నారు. అవసరం ఉన్న వారు భూమి పట్టాపాస్‌పుస్తకం జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకొని బుధవారం నుంచి విత్తనాలు తీసుకోవాలని కోరారు.

50శాతం సబ్సిడీపై విత్తనాలు

శంకర్‌పల్లి: పట్టణ, మండల రైతులకు 50 శాతం సబ్సిడీపై జీలుగ, జనుము విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయాధికారి సురేశ్‌బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటివరకు 100 క్వింటాళ్ల జనుము, 50 క్వింటాళ్ల జీలుగ అందుబాటులో ఉందన్నారు. అవసరం ఉన్న రైతులు పట్టాదారు పాస్‌బుక్, ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకొని, సంబంధిత వ్యవసాయాధికారిని సంప్రదించాలని సూచించారు.

ఐకమత్యంతోనే సమస్యల పరిష్కారం



నూతన కమిటీ సభ్యులకు నియామకపత్రం అందజేస్తున్న జలజ, నాయకులు

జాతీయ బీసీసేన మండల మహిళా అధ్యక్షురాలు జలజ

షాద్‌నగర్‌రూరల్: బీసీలందరూ సంఘటితంగా పోరాడితేనే సమస్యలు పరిష్కారమవుతాయని జాతీయ బీసీ సేన మండల మహిళా అధ్యక్షురాలు జక్కుల జలజ అన్నారు. మంగళవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని శేరిగూడ గ్రామంలో జాతీయ బీసీసేన మహిళా విభాగం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బీసీలు విద్య, ఉద్యోగ, ఆర్థిక, సామాజిక, రాజకీయ, ఉపాధి రంగాల్లో వెనుకబడి ఉన్నారన్నారు. బీసీల ఓట్లతో గెలిచి అధికారాన్ని చేపట్టిన పాలకులు వారి సమస్యలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. హక్కుల సాధనకు, సమస్యల పరిష్కారానికి బీసీలందరూ ఏకతాటిపైకి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించి సమాజంలో తమ శక్తిని చాటాలని సూచించారు. అనంతరం శేరిగూడ గ్రామ మహిళా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీ అధ్యక్షురాలిగా బైరమోని స్వాతి, ఉపాధ్యక్షురాలిగా బైరమోని శశికళ, ప్రధాన కార్యదర్శిగా బైరమోని లావణ్య, కార్యదర్శిగా బద్దుల వెంకటమ్మ, సహాయ కార్యదర్శిగా లక్ష్మమ్మను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన సభ్యులకు ఆమె నియామకపత్రం అందజేసి అభినందించారు. కార్యక్రమంలో నాయకులు స్రవంతిరాజ్, ప్యాట జయశ్రీకాంత్, మేకల వెంకటేశ్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

తిరంగా ర్యాలీని విజయవంతం చేయండి

నందిగామ: షాద్‌నగర్‌లో బుధవారం నిర్వహించనున్న తిరంగా ర్యాలీకి నియోజకవర్గంలోని అన్ని మండలాలు, గ్రామాల నుంచి పార్టీలకతీతంగా నాయకులు తరలివచ్చి విజయవంతం చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు వడ్ల అరవింద్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ఆపరేషన్ సిందూర్ విజయ ర్యాలీ, భారత సాయుధ దళాలకు గౌరవ వందనం సందర్భంగా ర్యాలీ నిర్వహిస్తున్నారని, ఈ కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. సాయంత్రం 4.30 గంటలకు షాద్‌నగర్ చౌరస్తా అంబేడ్కర్ విగ్రహం నుంచి కన్యకాపరమేశ్వరి దేవాలయం వరకు ర్యాలీ చేపట్టనున్నట్లు స్పష్టం చేశారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ



ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న రాములు

మొయినాబాద్‌రూరల్: ఇందిరమ్మ ఇళ్లను అర్హులైన ప్రతి ఒక్కరూ అందజేస్తామని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రాములు అన్నారు. మండల పరిధిలోని చిన్నమంగళారం గ్రామంలో పలువురికి మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఆయన భూమిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

మొయినాబాద్‌రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య లభిస్తుందని హెచ్ఎం నరేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని అమ్డాపూర్ గ్రామంలో బడిబాట కార్యక్రమాన్ని ఉపాధ్యాయులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరుగుతూ బడీడు పిల్లలను బడికి పంపించాలని తల్లిదండ్రులను కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ కల్పన, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

గో సంరక్షణ అందరి బాధ్యత



గోశాలకు గడ్డిని అందజేస్తున్న నవదుర్గ పరిశ్రమ ప్రతినిధులు

షాద్‌నగర్‌రూరల్: గో సంతతి అంతరించి పోకుండా గోవులను రక్షించుకోవడం మనందరి బాధ్యత అని ఆంజనేయస్వామి దేవాలయ ప్రధాన అర్చకుడు రఘుపతిరావు అన్నారు. అమావాస్యను పురస్కరించుకొని మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండలం మోతీఘణపూర్ గ్రామ సమీపంలోని నవదుర్గ పరిశ్రమ యాజమాన్యం మంగళవారం పట్టణ సమీపంలోని చౌడమ్మగుట్ట ఆంజనేయ స్వామి దేవాలయ ప్రాంగణంలో గల శ్రీకృష్ణ గోశాలకు వరిగడ్డిని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గో మాతను పూజిస్తే సకల దేవతలను పూజించినట్లేనన్నారు. గో సేవా మహాపుణ్యమని, ప్రతి ఒక్కరూ గోవులను పూజించాలని కోరారు. అనంతరం గడ్డిదానం చేసిన యాజమాన్యాన్ని ఆలయ అర్చకుడు, గోశాల నిర్వాహకులు అభినందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు శంకర్‌గౌడ్, ప్రవీణ్‌యాదవ్, రమేశ్, మాజీ వార్డుసభ్యుడు సింగపాగ లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

మురుగు.. పరుగు

మొయినాబాద్‌రూరల్: మున్సిపల్ పరిధిలోని అజీజ్‌నగర్ ఎస్సీ కాలనీలో అండర్ డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారి రోడ్లపై మురికి నీరు ప్రవహిస్తోంది. గత వారం రోజులుగా మురుగు పరుగులు తీస్తున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. మురుగు నీరు నిల్వ ఉండడంతో దుర్వాసన వస్తోందని, దోమల బెడద పెరుగుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మురుగు కాలువల్లో నిండిన చెత్తను తొలగించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.



ఎస్సీ కాలనీలో ఇళ్ల ఎదుట పారుతున్న మురుగు

పంటల మార్పిడితో అధిక లాభాలు



రైతులతో శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు

శాస్త్రవేత్తలు చిరంజీవి, వినయ్

చేవెళ్ల: రైతులు పంటల మార్పిడి విధానం అవలంబించి లాభాలు పొందాలని వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు డాక్టర్ చిరంజీవి, డాక్టర్ వినయ్ అన్నారు. మండలంలోని గుండాల గ్రామంలో మంగళవారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు పంటల సాగుపై అవగాహన కల్పించారు. సాగులో ఖర్చులు తగ్గించి నేల సంరక్షణకు సేంద్రియ ఎరువులను ఉపయోగించాలని సూచించారు. రైతులు వారు సాగు చేస్తున్న పంటల్లో ఉన్న సందేహాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందించే విత్తనాలు, యంత్ర సబ్సిడీలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. నీటి వృథాను తగ్గించి డ్రిప్ ఇరిగేషన్, స్ప్రింక్లర్‌ల విధానాన్ని పాటించాలని, పర్యావరణ పరిరక్షణకు చెట్లు పెంచాలని సూచించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ బుచ్చిరెడ్డి, గ్రామ రైతులు, వ్యవసాయాధికారులు ఉన్నారు.

ప్రశ్నిస్తే అరెస్టులా..?

సర్పంచ్‌ల సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి



పోలీసుల అదుపులో మాజీ సర్పంచ్‌లు

నందిగామ: గ్రామాల అభివృద్ధికి ఖర్చుపెట్టిన డబ్బులను ఇప్పటివరకు ఎందుకు చెల్లించడం లేదని ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే పోలీసులతో అక్రమ అరెస్టులు చేయించడం ఎంతవరకు సమంజసమని సర్పంచ్‌ల సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు జిలెల్ల వెంకట్‌రెడ్డి అన్నారు. పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ సర్పంచ్‌ల సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఆందోళన చేయనున్నారనే సమాచారంతో స్థానిక పోలీసులు పలువురు మాజీ సర్పంచ్‌లను మంగళవారం అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాము పెట్టిన ఖర్చులను చెల్లించాలని డిమాండ్ చేస్తే అరెస్టులు చేయడమేమిటని ఆయన ప్రశ్నించారు. పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని, లేనట్లయితే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు హెచ్చరించారు. అరెస్ట్ అయిన వారిలో మాజీ సర్పంచ్‌లు వెంకట్‌రెడ్డి, గోవిందు అశోక్ తదితరులు ఉన్నారు.

మిర్చి పంటల పరిశీలన

చేవెళ్ల: రైతులు వేసిన బజ్జీ మిర్చి పంటలను పరిశీలించి వివరాలను ఉన్నతాధికారులకు పంపిస్తామని మండల వ్యవసాయాధికారి శంకర్ లాల్, ఉద్యానశాఖ అధికారి కీర్తికృష్ణ అన్నారు. మండలంలోని చనువెల్లి గ్రామంలో బజ్జీ మిర్చి నారుతో మోసపోయామని రైతులు చేసిన ఫిర్యాదుతో మంగళవారం అధికారులు క్షేత్రపర్యటన చేసి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు నారు తీసుకొచ్చిన నర్సరీల వివరాలను తెలుసుకున్నారు. చనువెల్లి, పామెన గ్రామాల్లో దాదాపు 40 మంది రైతులు 70 ఎకరాలకుపైగా బజ్జీ మిర్చి నారును ఖమ్మం జిల్లాలోని వైరాలో ఉన్న నర్సరీ ద్వారా కొనుగోలు చేసినట్లు తెలిపారు. రెండు నెలల క్రితం కొనుగోలు చేసిన ఈ నారు వేసిన రైతులకు ఎవరికీ కూడా కాత పూత రాలేదని, దీనిపై నర్సరీ యజమానికి ఫోన్‌చేస్తే స్పందించటం లేదని వాపోయారు. ఇదే సమయంలో ఇతర నారు వేసిన రైతులకు మిర్చి కాత పూతలతో బాగున్నాయని అధికారులకు వివరించారు. పంటలను పరిశీలించిన అధికారులు పంట పెరిగింది కానీ కాత పూత లేకపోవటానికి గల కారణాలను ల్యాబ్‌లో పరిశీలించి తేల్చాల్సి ఉంటుందని, దీనిపై ఉన్నతాధికారులు, శాస్త్రవేత్తలు పరిశీలిస్తారని స్పష్టం చేశారు. పంటల వివరాల నివేదికను తయారు చేసి ఉన్నతాధికారులకు పంపిస్తామని తెలిపారు. రైతులు లైసెన్స్ కలిగిన నర్సరీలలోనే నారు కొనుగోలు చేయాలని, కొనుగోలుకు సంబంధించి రశీదులను తప్పనిసరిగా తీసుకొని భద్రపర్చుకోవాలని సూచించారు. అప్పుడే ఏదైనా జరిగినా కూడా వారిని ప్రశ్నించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో బాధిత రైతులు, గ్రామస్తులు ఉన్నారు.



చనువెల్లిలో బజ్జీమిర్చి పంటలను రైతులతో కలిసి పరిశీలిస్తున్న వ్యవసాయ, ఉద్యాన అధికారులు

కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయండి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనునాయక్



షాద్‌నగర్‌రూరల్: కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు, ఉపాధి కూలీలు

షాద్‌నగర్‌రూరల్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం రక్షణకు ఈ నెల 30న చేపట్టనున్న కలెక్టరేట్ ముట్టడికి ఉపాధి కూలీలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనునాయక్ పిలుపునిచ్చారు. మంగళవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని బూర్గుల గ్రామంలో ఉపాధి కూలీలతో కలిసి ఆయన కలెక్టరేట్ ముట్టడికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాతీయ ఉపాధి హామీ పథకాన్ని ఎత్తివేసేందుకు ప్రధాని మోదీ పన్నుతున్న కుట్రలను తిప్పికొట్టాలన్నారు. పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా ఉపాధి కార్మికుల కూలీ పెంచాలని డిమాండ్ చేశారు. కొలతలు లేకుండా డబ్బులు ఇవ్వాలని, పని ప్రదేశంలో మెడికల్ కిట్లు, తాగునీరు, టెంటు వసతివంటి కనీస సౌకర్యాలను కల్పించాలని, గడ్డపార, తట్ట, పార, గొడ్డలి వంటి పనిముట్లను ప్రభుత్వమే అందజేయాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకుడు నర్సింలు, ఉపాధి కూలీలు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

షాబాద్: ఉపాధి హామీ కూలీల వేతన బకాయిలను వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు బేగరి అంజయ్య పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఉపాధి హామీ కూలీల సమస్యల పరిష్కారానికి ఈ నెల 30న కలెక్టర్ ఆఫీస్ ఎదుట జరిగే ధర్నాకు సంబంధించిన కరపత్రలను వారు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ నర్సింహ, నాయకులు శ్రీనివాస్, ఎదిరే నర్సింహ, సుధాకర్, వర్ధన్, కార్తీక్, శంకర్, కార్తీక్‌యాదవ్ తదితరులు ఉన్నారు.